



లోపలకు వెళ్లేందుకు తోపులాట



జడ్పీ కార్యాలయంలో బారులుదీరిన అర్జీదారులు

వినతులు ఇవ్వాలన్నా ఇక్కట్లే

- జడ్పీలో 'మీ-కోసం' వద్ద తోపులాట
- వెళ్లేందుకు, వచ్చేందుకు ఒకటే మార్గం
- క్యూలో నిల్చోలేక అర్జీదారుల ఇబ్బందులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి.. విసిగిపోయి.. చివరకు జిల్లాకేంద్రంలోని జడ్పీలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ-కోసం' ప్రజా ఫిర్యాదుల వేదికలోనూ అర్జీదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ గోడు కలెక్టర్‌కు చెప్పుకుంటే.. సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో జిల్లా నలుమూలల నుంచి చాలామంది జడ్పీలో 'మీ-కోసం' కార్యక్రమానికి వస్తుంటారు. కానీ, ఇక్కడ వినతులివ్వడమే పెద్ద సమస్యగా మారిందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు వినతులు ఇచ్చేందుకు, తర్వాత బయటకు వచ్చేందుకు ఒక్కటే మార్గం కావడంతో సోమవారం అర్జీదారుల రద్దీ మధ్య తోపులాట చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున క్యూలో బారులుదీరారు. కూర్చొనేందుకు ఏర్పాట్లు లేక దివ్యాంగులు, వృద్ధులు, రోగులు ఇబ్బందులు పడ్డారు. సమస్యల పరిష్కారం మాట దేవుడెరుగు... అర్జీ సమర్పిస్తే చాలు... అనుకుంటూ చాలామంది నిట్టూర్చారు. అధికారులు స్పందించి ఈ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

సుపరిపాలనపై ప్రజల్లో సంతోషం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్
- కోష్టలో పర్యటన.. ప్రజా సమస్యలపై ఆరా

రణస్థలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం రణస్థలం మండలం కోష్టలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోంది. కోష్టలో ఆదరణ చూస్తే.. కూటమి పాలనలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో తెలుస్తోంది. ఏడాదిలో అన్ని శాఖల్లో కలిపి రాష్ట్రానికి రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. నాలుగేళ్లలో భారీస్థాయిలో పెట్టుబడులు రానున్నాయి. మా ప్రభుత్వం మరో రెండు దశాబ్దాలపాటు అధికారంలో ఉండాలి. అప్పుడే ఏపీ దేశంలో ఉత్తమ రాష్ట్రం అవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి దిశలో ముందుకు వెళ్తోందన్నారు. గ్రామాల్లో ప్రజలను నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, ముప్పిడి సురేష్, చౌదరి బాబ్జి, కలిశెట్టి సూర్యనారాయణ, పిన్నింటి భానోజీనాయుడు, లంక శ్యామలరావు, వద్దాది శ్రీను, ముక్కు ఆదినారాయణ పాల్గొన్నారు.



కోష్టలో కరపత్రం అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు



మెళియాపుట్టి మండలం బందపల్లి జీసీసీ డిపో పరిధిలో సుమారు 560 రేషన్ కార్డులకు ప్రతీ నెలా రేషన్ సరుకులు అందజేస్తున్నారు. ఈ డిపో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గత రెండేళ్ల నుంచి రామచంద్రపురంలోని పాత రైతుసేవా కేంద్రంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ భవనం చిన్నది కావడంతో సరుకులు నిల్వ చేయడానికి, పంపిణీకి ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్కడ ఉంచాలి.. ఎలా ఇవ్వాలి?

మెళియాపుట్టి మండలం చింతలపోలూరు జీసీసీ డిపో పరిధిలో సుమారు 381 రేషన్‌కార్డులు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి భవనంపై శ్లాబు పెచ్చులు ఊడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని డీలరు, కార్డుదారులు భయాందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో బియ్యం తడిచిపోతున్నాయని వాపోతున్నారు.



- శిథిలమైన జీసీసీ డిపోలు
- ఆందోళనలో గిరిజనులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి

మెళియాపుట్టి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) డిపోలు శిథిలావస్థకు చేరుకోవడంతో నిర్వాహకులు, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గిరిజనశాఖ ఆధ్వర్యంలో ప్రతేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. గిరిజనులు పండించిన ఉత్పత్తులతోపాటు వారికి అవసరమైన వస్తువులు అందించేందుకు గిరిజన గ్రామాల్లో 30ఏళ్ల కిందట జీసీసీ డిపో భవనాలు నిర్మించారు. ఈ డిపోల ద్వారా గిరిజనులు పండించిన పంటలతోపాటు అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసేవారు. గిరిజనులకు అవసరమైన నిత్యావసర వస్తువులను డిపోల ద్వారా విక్రయించేవారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా వదిలేయటంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. జీసీసీ డిపోల్లో ఉత్పత్తుల కొనుగోళ్లు, నిత్యావసర వస్తువుల విక్రయాలు సక్రమంగా చేపట్టడం లేదు. చాలా జీసీసీ డిపో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో గిరిజనుల నుంచి సేకరించిన పంటలు నిల్వ చేసేందుకు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం జీసీసీ డివిజన్ పరిధిలోని

(మిగతా 6వ పేజీలో..)

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

- ఫలించిన మంత్రి అచ్చెన్న కృషి

శ్రీకాకుళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ.. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. టెక్కలి నియోజకవర్గంలో తక్కువ ఆదాయంతో నడుస్తున్న దేవాలయాలకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన కృషి ఫలించింది.

- కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనుల నిమిత్తం సర్వశ్రేయోనిధి నుంచి రూ.50 లక్షలు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంజూరు చేశారు. ఆలయ నిర్మాణంలో అధికారులకు తగిన సూచనలను సలహాలిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడుని కోరారు.
- అలాగే ధూపదీప నైవేద్య పథకం కింద శ్రీభ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం(కురుడు), శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం (హరిదాసుపురం), శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం (డీ.ఎల్.పురం), శ్రీ ఉమాకౌలి రామలింగేశ్వరస్వామి దేవాలయం(బోరుభద్ర), శ్రీ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయం(సానివాడ), శ్రీఉమాసహిత నీలకంఠేశ్వరస్వామి (నందిగాం) దేవాలయాలకు నెలకు రూ.10వేలు చొప్పున అందజేయనున్నారు. అర్చకులకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఈ నిధులను విడుదల చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరుపై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు.



నరసన్నపేట : మాకివలస వద్ద వాడిపోతున్న వరిఎదలు

చినుకు రాలదు.. సాగునీరందదు

- ఎండిపోతున్న వరిఎదలు. నారుమళ్లు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపు

నరసన్నపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో కొన్నిచోట్ల అడపాదడపా వర్షాలు కురుస్తున్నా, ఎండలు మాత్రం వేసవిని తలపిస్తున్నాయి. చాలాచోట్ల చినుకుజాడ లేక వరి ఎదలు, నారుమళ్లు ఎండిపోతున్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట మండలాల్లో ఈ ఏడాది 16వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. 90 శాతం మేరకు ఎదలు వేయగా.. 10శాతం మాత్రమే వరినారు మళ్లు వేశారు. రెండు వారాలుగా వర్షం కురవకపోవడంతో నరసన్నపేట, పోలాకి మండలాల్లో వరి ఎదలు ఎండిపోతున్నాయి. నారుమళ్లు రాగి రంగులో మారుతున్నాయి. వంశధార కాలువల ద్వారా కూడా తగినంత స్థాయిలో నీరు రాకపోవడంతో పొలాల్లోకి వెళ్లడం లేదు. నరసన్నపేట మండలం కామేశ్వరిపేట, లుకలాం, నర్సింగరాయుడు పేట, సుందరాపురం, పారశెల్లి, చోడవరం, ఉర్లాం, చింతువానిపేట, కోమర్తి, మాకివలస, మడపాం, గోపాలపెంట, బాలసీమ, చిక్కాలవలస పోలాకి మండలం జిల్లేడివలస, చీడివలస, ఈదులవలస, సుసరాం, డోల, ఉర్జాం, జడూరు తదితర ప్రాంతాల్లో వరిఎదలు, నారుమళ్లు ఎండిపోయాయి. ఓపెన్ హెడ్‌ఛానెల్స్‌లో నీరు రాక ఉర్లాం, నడగాం, చోడవరం, లుకలాం తదితర ప్రాంతాల్లో పొలాలు బీడుగా కనిపిస్తున్నాయి. దీంతో వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందించాలని, ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



తామరాపల్లి వద్ద వరినారు ఇలా..

ఇక్కడ జోరుగా వరినాట్లు..

ఇచ్ఛాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో మాత్రం ఆశించినంతగా వర్షాలు కురవడంతో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలో వరిసాగు విస్తీర్ణం సుమారు 8,000 ఎకరాలు కాగా, ఇప్పటికే బూర్జపాడు, బిర్లంగి గ్రామాల్లో 120 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాశాఖ అధికారి పి.అజయ్‌కుమార్ తెలిపారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 274 మి.మి. కాగా 191 మి.మీ. వర్షపాతం నమోదైంది. 29శాతం లోటు వర్షపాతం ఉన్నా రైతులు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారని ఏవో తెలిపారు. నాట్లు వేసిన వెంటనే కలుపు నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు.



ఇచ్ఛాపురం : తేలుకుంచిలోని పొలాల్లో వరినాట్లు



- పెరుగుతున్న అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ బాధితులు
- నేడు ప్రపంచ మస్తిష్క దినోత్సవం

ఒత్తిడితోనే సగం జబ్బులు

శ్రీకాకుళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవుడిపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికితోడు జీవనశైలిలో మార్పుల వల్ల అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి వాధుల బాధితులు పెరుగుతున్నారు. ఫలితంగా మెదడు సంబంధిత సమస్యలతో చాలామంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వీటికి దీర్ఘకాల ఒత్తిడే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ప్రపంచ మస్తిష్క దినోత్సవం(బ్రెయిన్ డే) సందర్భంగా మెదడు గొప్పతనం, దీర్ఘకాలిక ఒత్తిడి నుంచి ఎలా ఉపశమనం పొందాలనే విషయం తెలుసుకుందాం.

ఆలోచనలు, ఆకలి, ఆనందం ఇలా ప్రతి కదలికకు, భావనకు మూలం నిశ్శబ్దంగా పని చేసే మెదడు. జ్ఞాపకాలు దాచుకుంటూ.. కొత్త విషయాలను నేర్చుకుంటూ.. భావోద్వేగాలు పంచుకోవడంలో మెదడు కీలకపాత్ర పోషిస్తుంది. మాటలకు, మనం చూసే, వినే, స్పర్శించే, రుచి చూసే ప్రతి దానికి ఇదే కేంద్రం. దాదాపు 1.4కిలోల బరువు ఉండే మెదడు.. వంద బిలియన్లకుపైగా నరాల కణాలతో(న్యూరాన్లు) అల్లుకుపోయిన అద్భుతమైన నెట్‌వర్క్. ప్రతి సెకన్‌కు లక్షలాది సంకేతాలు పంపుతూ, స్వీకరిస్తూ, విశ్లేషిస్తుంది. నిద్రపోయినా, మెలకువుగా ఉన్నా, మెదడు మాత్రం నిరంతరంగా పనిచేస్తోంది. శ్వాస తీసుకోవడం దగ్గర నుంచి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడం వరకూ ప్రతి పని మెదడు నియంత్రణలో జరుగుతుంది.

కాగా, ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, నిరంతర ఒత్తిడి, సాంకేతికతతో కూడిన జీవితం ఇవన్నీ మెదడుపై ఊహించని భారాన్ని మోపుతున్నాయి. దీంతో చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గర్భాధారణకు ముందు నుంచి బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం వరకూ ఇలా మనిషి జీవితంలో ప్రతి దశలోనూ మెదడు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు.

- ఆధునిక ప్రపంచంలో మెదడు ఆరోగ్యం సవాల్‌గా మారింది. సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, పోషకాహార లోపం, నిద్రలేమి, దీర్ఘకాలిక ఒత్తిడి మెదడు పని తీరును ప్రభావితం చేస్తాయి. జ్ఞాపక శక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం, మానసిక ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. అలాగే వృద్ధాప్యంలో అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి మెదడు సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ వ్యాధులు వ్యక్తిగతజీవితంపైనే కాకుండా కుటుంబాలు,సమాజంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే మెదడును చిన్నతనం నుంచే ఆరోగ్యంగా ఉంచుకోవడంపై శ్రద్ధపెట్టాలి.
- మెదడు దెబ్బతింటే.. జ్ఞాపకశక్తి మందగించడం, కొన్ని విషయాలు మరచిపోవడం, దారితప్పిపోవడం, మనుషులను గుర్తుపట్టలేకపోవడం (మిగతా 6వ పేజీలో..)

ఎన్టీఆర్ జలసిరి.. రైతులకు అండ
● జిల్లాకు రూ.50 కోట్లు కేటాయింపు
● త్వరలో మార్గదర్శకాలు జారీ.. 6లో

మా భూములు ఖాళీ చేయాలంట!
● ఓ ప్రభుత్వ ఉద్యోగి మమ్మల్ని బెదిరిస్తున్నారు
● గ్రీవెన్స్ వద్ద పెంటిభద్ర గిరిజనుల ఆవేదన 6లో

'తల్లికి వందనం' రాలేదు సార్!
● సింగుపురం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన 6లో

బతికి ఉన్న కుటుంబాన్ని చంపేస్తారా? 8లో
● సచివాలయ సిబ్బందిపై జేసీ ఆగ్రహం

నాటి నావలరేవు.. నేడు నువ్వలరేవు 6లో
● రికార్డుల్లో మాత్రం లక్ష్మీదేవిపేటగా నమోదు



నాటి నావలరేవు.. నేడు నువ్వలరేవు

రికార్డులలో మాత్రం లక్ష్మీదేవిపేటగా నమోదు

వజ్రపుకొత్తూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆచార సంప్రదాయాలకు... కట్టుబాట్లకు నిలయమైన నువ్వలరేవు గ్రామం పేరులో ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలో కేవిటీ కులస్తులు ఉన్న ఏకైక గ్రామం నువ్వలరేవు. సుమారు పది వేల జనాభా ఉండే ఈ గ్రామానికి జిల్లాలోనే ఎంతో ప్రత్యేకత ఉంది. 300 ఏళ్ల కిందట ఒడిశా ప్రాంతం నుంచి కేవిటీ కులస్తులు ఈ ప్రాంతానికి వచ్చినట్లుగా చరిత్ర చెబుతోంది. బ్రిటిష్ కాలంలో నువ్వలరేవు తీరం పక్కనే ఉప్పుటేరును ఆనుకొని సరుకుల రవాణా కోసం నావలు నడిపే వారు. దీంతో ఇక్కడ పనులు చేసేందుకు కేవిటీలు ఈ ప్రాంతానికి వచ్చి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. ఈ గ్రామానికి సమీపంలో నావలు రాకపోకలు సాగించడం వల్ల నావలరేవుగా పిలిచేవారు. కాలక్రమేణా నావలరేవు పేరు నువ్వలరేవుగా మారినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులలో మాత్రం లక్ష్మీదేవిపేటగా పేరు నమోదై ఉంది. ఈ పేరు గ్రామంలో సగం మందికి తెలియదనే చెప్పాలి. ఇప్పటికీ నువ్వలరేవు తీరంలో లైట్‌హౌస్ ఉంది. అలాగే మత్స్యశాఖ కార్యా లయం, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు ఉండేవి. భవనాలు శిథిలం కావడంతో తొలగించారు. ప్రస్తుతం నువ్వలరేవు తీరానికి నావలు రాకపోకలు సాగించనప్పటికీ ఈ గ్రామం పేరు నువ్వలరేవు గానే స్థిరపడిపోయింది. ఈ గ్రామంలో ఏటా సాముహిక వివాహాలు నిర్వహించడం ఆచారంగా పాటిస్తున్నారు. ఒకేసారి వంద నుంచి రెండు వందల వరకు వివాహాలు జరుపుకుంటారు. ఈ పెళ్లిళ్లకు సంబంధించి వధూవరులు ఒకే గ్రామస్థులు కావడం విశేషం. గతంలో ఓసీగా ఉన్న కేవిటీ కులస్తులను బీసీ-ఎ జాబితాలో రాష్ట్ర ప్రభుత్వం చేర్చింది.

నావల రాకపోకలతో..

మా గ్రామానికి మొదట నావలరేవుగా పేరు ఉండేదని తరువాత నువ్వలరేవు గా మారిందని మా పెద్దలు చెబుతారు. మా సముద్ర తీరంలో నావల రాకపోకలు సాగించడంతో పాటు వాటిని నిలుపుదల చేయడానికి ఉప్పుటేరు అనుకూలంగా ఉం డేది. నావలు సరుకులు రవాణా చేసేవి. ప్రస్తుతం ప్రభుత్వ రికార్డులలో లక్ష్మీదేవిపేట గా నమోదై ఉంది.

- బైనపల్లి భీమారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

కట్టుబాట్లకు విలువ ఇస్తాం

సంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధికంగా విలువ ఇస్తాం. కేవిటీ కులం నువ్వలరేవులో ఉండడంతో అన్ని కుటుంబాలకు బంధుత్వాలు ఉన్నాయి. పెద్దల మాటకు విలువ ఇవ్వడమే కాకుండా వారి నిర్ణయానికి గ్రామం కట్టుబడి ఉంటుంది. గ్రామదేవత బృందావతి మాత ఆలయం వద్ద తీసుకున్న నిర్ణయం శిరోధార్యం.

- బి.పూర్ణ, సర్పంచ్, నువ్వలరేవు

శాంకబరిగా కన్యకాపరమేశ్వరీదేవి



శ్రీకాకుళం కల్చరల్ జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాస వారోత్సవాల సందర్భంగా చిన్నబజారు వీధిలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ కూరగాయలు, పూలతో అలంకరించారు. శాంకబరిదేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎక్కడ ఉంచాలి.. ఎలా ఇవ్వాలి?

(ఐదో పేజీ తరువాయి)

మెళియాపుట్టి, నందిగాం, మందస, పాతపట్నం, టెక్కలి మండలాల్లో 21 జీసీసీ డిపోలు ఉన్నాయి. వీటితోపాటు పాతపట్నంలో గిడ్డంగి ఉంది. ఇందులో 10 భవనాలు పూర్తిగా కూలిపోయే పరిస్థితి ఉంది. ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా, నిధులు మంజూరుకాక నూతన భవనాలు నిర్మించడం లేదు. కొన్ని భవనాలు నిరుపయోగంగా వదిలేయడంతో కొంతమంది ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీసీసీ డిపోలకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జీసీసీ డిపోల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాం. కొన్ని గ్రామాల్లో భవనాలు లేక ఇతర శాఖలకు సంబంధించినవి వినియోగిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం.

- నర్సింహులు, జీసీసీ మేనేజర్, పాతపట్నం




ఎన్టీఆర్ జలసిరి రైతులకు అండ

జిల్లాకు రూ.50 కోట్లు కేటాయింపు

త్వరలో మార్గదర్శకాలు జారీ.. హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యం



ఇచ్ఛాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించనుంది. రైతులకు తక్కువ ఖర్చుతో వ్యవసాయ పంపుసెట్లు అందుబాటులోకి తేనుంది. పొలంలో నీరు ఉంటే రైతులు సిరులు పండించవచ్చని అంటారు. జిల్లాలో మెట్ట ప్రాంతమే ఎక్కువ. బోర్లే సాగు నీటికి ఆధారం. కానీ బోర్లు కట్టాలంటే రైతుకు తలకు మించిన భారం. అందుకే ఎక్కువమంది రైతులు ప్రభుత్వ రాయితీ కోసం ఎదురు చూస్తుంటారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందిస్తూ వచ్చింది. సూక్ష్మసేద్యం పరికరాలు, పనిముట్లను అందించింది. ఆ స్ఫూర్తితోనే ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి సమర్థంగా అమలుచేసింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం నీరుగారి పోయింది. టీడీపీ ఐదేళ్లలో 2,639 మందికి జలసిరి పథకం ద్వారా బోర్లు తవ్విస్తే వైసీపీ ఐదేళ్లలో కేవలం 246 బోర్లను తవ్విందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పీఎం కుసుమ్‌తో అనుసంధానం..

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో ఎన్టీఆర్ జలసిరికి భారీగా నిధులు కేటాయించింది. జిల్లాకు రూ.50 కోట్లు ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం మార్గదర్శకాలను తయారుచేసే పనిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కుసుమ్ పథకంతో అనుసంధానించి అమలు చేసేందుకు నిర్ణయించింది. ఒక్కో యూనిట్‌పై కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతాన్ని రాయితీ కింద అందించనుంది. లబ్ధిదారుడు కేవలం 30 శాతం భరించాలి. ఇందులో కూడా బ్యాంకు రుణం ఇప్పించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అదే సమయంలో సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను సైతం ప్రభుత్వం అమర్చనుంది.

● 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని ప్రారంభించింది. ఉచితంగా బోరు తవ్వించి.. రాయితీపై పైపులు, ఇతర సామగ్రి అందించడమే ఈ పథకం ఉద్దేశం. అప్పట్లో 2,639 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం అందరికీ బోర్లు ఉచితంగా తవ్వించింది. 1969 మందికి సోలార్ కనెక్షన్లు అందించింది. మిగతావారికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చింది.

● వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని వైఎస్సార్ జలకళ పథకంగా మార్చింది. 3,600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ 246 మందికి మాత్రమే అమలు వేశారు. ఈ పథకం విషయంలో ఐదేళ్ల పాటు ఆర్భాటమే నడిచింది. రైతులు పడిన బాధలు వర్ణనాతీతం.

ఎంతో ప్రాధాన్యం..

ప్రభుత్వం జలసిరికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. వార్షిక బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులకు, సాగునీటి ఆధారం లేని భూములకు జలసిరి పథకం కొండంత అండ.

- సుధాకరరావు, డ్వామా పీడీ



ఒత్తిడితోనే సగం జబ్బులు

(ఐదో పేజీ తరువాయి)

వంటి సమస్యలు తలెత్తుతాయి. డిప్రెషన్, యాంగ్జటీ, బయాపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రీనీయా వంటివి వస్తాయి. ఆలోచనల్లో స్పష్టత లేకపోవడం, ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన రావడం, కోపం, చిరాకు, ఆవేశం, నిద్రలేమి, భావోద్వేగాలు నియంత్రించకోలేకపోవడం, పక్షవాతం, మైగ్రేన్ వంటివి సమస్యలు కూడా కనిపిస్తాయి.

మెదడుకి శక్తినిచ్చే మార్గాలు

● మెదడుకు విశ్రాంతి అవసరం. రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్రపోవాలి. మంచి నిద్ర మెదడు కణాలను బాగుచేసి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. సరైన నిద్ర లేకపోతే, ఆలోచన శక్తి, ఏకాగ్రత తగ్గుతాయి.

● ఓమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు గల చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కలిగిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు వంటివి మెదడు ఆరోగ్యానికి అత్యవసరం.

● దూమపానం, మద్యపానం, ప్రాసెస్ చేసిన ఆహారాలు అధిక చెక్కర సంతృప్త కొవ్వులు వంటి వాటి వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది.

● మెదడుకు వ్యాయామం అవసరం. రోజుకి 30 నిమిషాలు నడవడం, యోగా, సైక్లింగ్, డాన్స్ వంటివి చేయడం వల్ల మెదడు రక్తప్రసరణ మెరుగుపడుతుంది.

● నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలి. కొత్త భాష, సంగీత వాయిద్యం నేర్చుకోవడం, పజిల్స్ సూడోకు వంటి ఆటలు ఆడడం, పుస్తకాలు చదవడం, సృజనాత్మక పనులు చేయడం మెదడుకు పదును పెడతాయి.

● దీర్ఘకాలిక ఒత్తిడి మెదడుకు హానికరం. ఇది జ్ఞాపశక్తికి, ఏకాగ్రతను దెబ్బ తీస్తుంది. అందుకే ధ్యానం, యోగా, శ్వాస, వ్యాయామం, ప్రకృతిలో గడపడడం స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మెదడు చురుగ్గా ఉంటుంది.

మెదడును నిర్లక్ష్యం చేయకూడదు



మెదడు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం చాలా ప్రమాదకరం. చిన్ననాటి నుంచే మెదడు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీని వల్ల మెదడుకు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. వారానికి కనీసం 150 నిమిషాల మోడరేట్ వ్యాయామం లక్ష్యంగా పెట్టుకోవాలి. రోజుకి 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. దీర్ఘకాలిక ఒత్తిడి మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ధ్యానం, యోగ, శ్వాస వ్యాయామాలు ఒత్తిడిని తగ్గిస్తాయి.

- డాక్టర్ విజయలక్ష్మి, సైకియాట్రిస్ట్, జీజీహెచ్, శ్రీకాకుళం

మా భూములు ఖాళీ చేయాలంట!

● ఓ ప్రభుత్వ ఉద్యోగి మమ్మల్ని బెదిరిస్తున్నారు ● గ్రీవెన్స్ వద్ద పెంటిభద్ర గిరిజనుల ఆవేదన



గ్రీవెన్స్ వద్ద తమ వద్ద ఉన్న పత్రాలు చూపుతున్న పెంటిభద్ర గిరిజనులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): తామంతా తరతరాలుగా జీడి తోటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఓ ప్రభుత్వ ఉద్యోగి తమ భూములను ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నారని పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 3వ వార్డు పెంటిభద్ర గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీకోసం'లో అధికారులకు ఫిర్యాదు చేశారు. 'మాకు 1984లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 295, 296, 297లలో పట్టాలు కూడా జారీ చేసింది. ఈ భూముల్లో సాగు చేస్తున్న జీడి తోటల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకుతున్నాం. అయితే ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆ భూములు తన తల్లి పేరున ఉన్నాయని, 1963లోనే పట్టా ఇచ్చారని, వెంటనే ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. రీ సర్వే చేసి సాగుదారులకు పొజిషన్ సర్టిఫికేట్లు మంజూరు చేసి న్యాయం చేయాలి' అని గిరిజనులు కోరారు.

'తల్లికి వందనం' రాలేదు సార్!

సింగుపురం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన



డీఈవోకు తమ సమస్య విన్నవిస్తున్న తల్లిదండ్రులు

మండల పరిషత్ పాఠశాలలో 2,3,4,5 తరగతులు చదువుతున్న మా పిల్లలకు తల్లికి వందనం రాలేదని సింగుపురం పాఠశాల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం 'మీకోసం'లో ఫిర్యాదుచేశారు. 120 మంది విద్యార్థులకు పథకం వర్తించ లేదన్నారు. వెబ్‌సైట్‌లో ఆధార్ నెంబర్ ద్వారా పరిశీలిస్తే పేర్లు లిస్టులోనే లేవని చూపిస్తోందని వాపోయారు. కూలి పనులు చేసుకుంటే గాని జీవనం సాగదని, ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునే స్తోమత లేదని, అయితే ఎవరు తప్పు చేశారో తెలియదని, మా పిల్లల పేర్లు లిస్టులో లేకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై గ్రీవెన్స్‌కు రెండోసారి వచ్చామని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఈవో తిరుమల చైతన్యను వేడుకున్నారు.

వినతులను సత్వరమే విచారించి పరిష్కరించాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'మీకోసం'లో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశిం చారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక 'మీకోసం' నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ప్రజల నుంచి 80 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలు పరిష్కారం కాకుంటే ఆ సమాచారాన్ని అర్జీదారునికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో పారదర్శకత అవసరం

● ప్రజలకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరాలి ● రికార్డులు సిద్ధం చేసుకోండి ● జాతీయ పర్యవేక్షణ బృందం సభ్యులు



కేంద్ర పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న పర్యవేక్షణ బృందం సభ్యులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పథకాల అమలులో పారదర్శకత అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ మానటరింగ్ బృందం సభ్యులు సునీల్ బంటా, నాథుసింగ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లాలో అమలవుతున్న జాతీయ పథకాలపై సమీక్ష నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ, పీఎం గ్రామ సడక్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రాం, సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన తదితర పథకాల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. సంబంధిత శాఖలు తమ రికార్డులు, డేటా, అమలుపై సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాటర్‌షెడ్ అభివృద్ధి, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డుల ఆధునికీకరణ, ఇంటర్-కనెక్టివిటీ వంటి అంశాల్లో వేగవంతమైన పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ అప్పారావు, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, డీపీవో భారతి సౌజన్య, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



అనివెట్టి మండపంలో శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణం జరిపిస్తున్న ఆలయ అర్చకులు

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని అనివెట్టి మండపంలో ప్రధానార్చకులు ఇప్పిలి.శంకరశర్మ ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ వేడుక కమనీయంగా జరిపించారు. ఉత్సవమూర్తులను పీటలపై ఆశీనులను చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ వేడుకను భక్తులు కనులారా వీక్షించి తరించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, రంప వికాస్‌శర్మ, నగేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసనలు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం సమర్పణ


ఆమదాలవలస: నినాదాలు చేస్తున్న కార్యకర్తలు


ఇచ్ఛాపురం: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన


ఎచ్చెర్ల: సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


టెక్కలిలో నిరసన



పలాస రూరల్: కాశీబుగ్గలో..


నరసన్నపేటలో..


పాతపట్నం: సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

రోడ్డు తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోండి


సీసీ రోడ్డును తవ్వేసిన దృశ్యం

జి.సిగడాం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గెడ్డకంచరాం శివాలయం నుంచి గ్రామ శ్మశాన వాటిక వరకు ఇటీవల సుమారు రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కొందరు గ్రామస్థులు తవ్వేసారని, తక్షణం అధికా రులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కూటమి నాయకుడు నక్క మురళీధర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజావసరాలకు వినియోగించే రోడ్డును అడ్డంగా తవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఘటనా స్థలాన్ని పరిశీలించి రోడ్డును తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లగేజీ వ్యాన్

పొందూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాపాక కూడలి సమీపంలో ఎరుకల కాలనీ వద్ద సోమ వారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన లగేజీ వ్యాన్ ఢీ కొట్టడంతో వాహనదారులు గాయపడ్డారు. కాలనీ ఎదురుగా విశ్రాంత ఉపాధ్యాయులు వి.ఉమా మహేశ్వరరావు స్నేహితుడు రాము ద్విచక్రవాహనం నిలిపి మాట్లాడుకుంటుండగా లక్ష్మీపేటకి చెందిన ఎం.పైడిరాజు లగేజీ వ్యాన్ వేగంగా తీసుకువెళ్లి ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనదారులిద్దరూ గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను పొందూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

బోరు మరమ్మతులపై హర్షం


బోరు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

ఇచ్ఛాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 22వ వార్డు బాసుదేవ క్వార్టర్స్‌లో బోరు పాడవడంతో స్థానికులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో వార్డు టీడీపీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్ స్పందిం చారు. సమస్యను కమిషనర్ రమేష్ దృష్టికి తీసుకువెళ్లి బోరుకు అవసరమైన మెటీరియల్‌ను తీసుకువచ్చారు. తన సొంత నిధులతో బోరుకుమరమ్మతులు చేసి ప్లాట్‌ఫారం ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, మహిళలు హర్షం వ్యక్తంచేసి కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రి చితికి కుమార్తె దహన సంస్కారం


దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె

కవిటి,జూలై 21 (ఆంధ్రజ్యోతి): తండ్రి చితికి కుమార్తె దహన సంస్కా రాలు చేసిన ఘటన సోమవారం కవిటి లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గుడియా రవి (50) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని దేవాలయానికి వెళ్లి వచ్చి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ కుప్పకూలి ఊపిరి వదిలాడు. ఈయనకు కుమార్తె దీపిక తప్ప కొడుకులు లేరు. ఈనేపథ్యంలో డిగ్రీ చదువుతున్న కుమార్తె తండ్రి చితికి నిప్పంటించి దహన సంస్కారాలు నిర్వహించింది. కుటుంబం పెద్ద దిక్కున కోల్పోవడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

బెజ్జిపుట్టుగ ఆలయానికి నిధులు మంజూరు


ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

కవిటి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామంలోని శ్రీచక్రపెరు మాళ్ల స్వామి ఆలయంలో ముఖ మండప నిర్మాణానికి నిధులు మంజూ రయ్యాయని ధర్మకర్త పి.కృష్ణారావు నాయుడు తెలిపారు. ప్రజా విరాళంతో కలిపి దేవ దాయ శాఖ ద్వారా రూ.35 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చా యన్నా రు. ఈ మేరకు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలో గ్రామస్థు లు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బి.జగ న్నాథం, బి.మోహనరావు, బి.నర సింహమూర్తి, జి.రామ్మూర్తి, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైరు బండిళ్లు పోయాయంటూ ఫిర్యాదు

శ్రీకాకుళంక్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎన్‌కాలనీ జీరో లైన్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో ఆరు కాపర్ వైరు బండిళ్లు పోయాయని హౌస్ కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్ కల్లేపల్లి కోటేశ్వరరావు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణం చేపడుతున్న ఇంటికి వాచ్‌మెన్ సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆరు కాపర్‌వైరు బండిళ్లు కనిపించ లేదని సూపర్‌వైజర్ కోటేశ్వరరావుకు తెలిపాడు. దీంతో ఆయన చేసిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపి హత్య కేసులో మాజీ ఎంపీటీసీ అరెస్ట్

రణస్థలం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకి చెందిన వైసీపీ కార్యకర్త సత్తారు గోపి హత్య కేసులో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట అమ్మినాయుడును సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్టు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేశామన్నారు. గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతున్నట్టు చెప్పారు. ప్రజలు ఎలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా సహకరించాలన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు భవిష్యత్‌లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వినతులను తక్షణం పరిష్కరించాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత నిస్తూ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యా దులు నమోదు, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మంది నుంచి ఫిర్యా దులు స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమ యంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక అందించాలని అధికారులకు ఆదేశించారు.

మసీదులోకి వాడుకనీరు వస్తోంది

జి.సిగడాం మండలం పాలఖండ్యాం గ్రామంలో ఉన్న మసీదులోకి ఎదురుగా ఉన్న ఓ ఇంటి నుంచి వాడుకనీరు నేరుగా మసీదులోకి వస్తోందని 50 ముస్లిం కుటుంబాలు ఎస్పీకి ఫిర్యాదు చేశాయి. వాడుకనీరు మసీదులోకి వస్తున్న విషయమై సదరు మహిళను నిలదీస్తే సదరు ఆమె మద్దతుదారు తమను వేధిస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మహిళ ఇంటి నుంచి వాడుకనీరు బయటకు వెళ్లేందుకు ఒక పైపులైన్ ఏర్పాటు చేసినా ఆ పైపునకు వాడుకనీరు కనెక్షన్ ఇవ్వకుండా మసీదు వద్ద ఉన్న రోడ్డువైపు వాడుక నీరు వదిలివేస్తోందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరుగుదల

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పచ్చిరొట్ట పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్టను వాడడం వల్ల 25శాతం ఎరువులు ఆదా అవుతాయని, అంతే కాకుండా మట్టికి జీవం వస్తుందన్నారు. నేల సారం పెరిగి, సాగు ఖర్చులు తగ్గు తాయని, పంటకు బలం చేకూ రుతుందన్నారు. ప్రతి రైతు పచ్చిరొట్టను వినియోగిం చాలని కోరారు. బయో ఫెర్టిలైజర్స్ వాడేటప్పుడు గడువు మించ కుండా జాగ్రత్త పడాలన్నారు. రసాయనిక ఎరువులు, కీటక నాశనాలతో కలిపి వేయకూడదని, నేలలో తగి నంత తేమ ఉన్నప్పుడు వాడితే మంచిదన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కనక దుర్గమ్మకు ఆషాఢం సారె

శ్రీకాకుళం కల్చరల్ జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి గార మండలానికి చెందిన దుర్గాభవానీ సేవా సమితి సభ్యులు ఆషాఢం సారెను సమర్పించారు. సుమారు 14 మంది సభ్యులు విజయవాడ వెళ్లి వీటిని అమ్మవారిని దర్శించుకుని సారె అందించారు. ఆ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ.. అమ్మవారికి అనాదిగా ఆషాఢం సారె అందించడం ఆనవాయితీ అని, ఇందులో భాగంగానే ఈ ఏడాది అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించినట్లు తెలిపారు. ఇటు వంటి ధార్మిక కార్యక్రమాలు చేపట్టడం వల్ల మన సంస్కృతి భావి తరాలకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సావాడ రామారావు వ్యవస్థాపక కార్యదర్శి పొదిలాపు అప్పారావు, అరసవల్లి రాజు, ఇప్పిలి రమణ, గొర్లె శ్రీరాములు, కలగ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆషాఢం సారెను ప్రదర్శిస్తున్న సమితి ప్రతినిధులు

నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టండి

● ఆర్డీవో సాయి ప్రత్యూష


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఆమదాలవలస, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నిమ్మతొర్లాడ వద్ద ఇసుక ర్యాంప్ తవ్వకాలు నిబంధనల మేరకు చేపట్టాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష ఆదేశిం చారు. ఆదివారం అర్ధరాత్రి ఇసుక ర్యాంప్ నిర్వాహకులకు గ్రామస్థులకు మధ్య వివా దం జరగడంతో సోమవారం ఇరిగేషన్ ఈఈ కొన్నాడ సుధాకర్‌తో కలిసి ఆమె విచారణ చేపట్టారు. ఈ ప్రాంతంలో శ్మశాన వాటిక, పశువుల మేత ప్రదేశం, యువకులు ఆటలాడు కునేందుకు ఉపయోగిస్తున్నామని, ఈ ప్రదేశం మధ్య నుంచి వాహనాల రాకపోకలకు రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఈ మూడు ప్రదేశాలను విడిచిపెట్టి ఇసుక తవ్వకాలు చేపట్టాలని ఆర్డీవో నిర్వాహకులకు సూచించారు. ఈ వివాదం దృష్ట్యా ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌ను మూసివేయాలని వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీకాకుళం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడ గ్రామానికి చెందిన బొంతల భూలోకమ్మ(53) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భూలోకమ్మ ఈనెల 16న గ్రామంలోని మిల్లులో పనిచేస్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనంపై భైరి నుంచి చింతాడకు వస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందింది. మృతురాలి కుమారుడు బొంతల దాలినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

గార జూలై 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి సూచిం చారు. సోమవారం కొల్లివలసలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గార, శ్రీకాకుళం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని దీని వల్ల కలిగే చెబు ప్రభావాలను ప్రజలకు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రా లను నిర్దేశిత వేళల్లో తెరిచి ఉంచాలన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఆ నెలలో అందించిన పోషకాలు, ప్రీ స్కూల్‌పై వివరించాలన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ఆమదాలవలస, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివిద్దాం.. ఆడపిల్లలను రక్షిద్దాం అని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి కె.ప్రసన్నరాణి అన్నారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింస, అత్యాచారాలు, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు మహిళల అక్రమ రవాణాలను అరికట్టేందుకు ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల సిబ్బంది భాస్కరరావు వై.పుష్పలత, పుష్ప పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఎచ్చెర్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): సంతశీతారాంపురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జేసీస్ సహకారంతో సోమవారం హృద్రోగ శ్వాస కోశ పునర్జీవన చర్య (సీపీఆర్)పై అవగాహన కలిగించారు. అత్యవసర సమయంలో మనిషికి సీపీఆర్‌ను చేసి శ్వాస ఎలా అందించాలో జేసీఐ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ సీపీ ఆర్‌పై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంటనే జీతాలు చెల్లించాలి

ఆమదాలవలస, జూలై 21 (ఆంధ్రజ్యోతి):ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులకు తక్షణం జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు పైడి వెంకటరమణ కోరారు. సోమవారం ఎమ్మార్సీలో సంఘం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల వరకు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవాధ్యక్షుడు మెట్ట సన్యాసిభట్లు, ప్రధాన కార్యదర్శి గణేష్, వెంకటరమణ, హిమవంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం రిమ్స్, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ కోరారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి ఆధ్వర్యంలో సోమవారం సంఘ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ స్టాఫ్ నర్సులతో నాన్ నర్సింగ్ డ్యూటీలు, డేటా ఎంట్రీ పనులు చేయించడం సరికాదన్నారు. కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటమ్మ, విశాఖ, మన్యం జిల్లాల అధ్యక్షులు గంగా భవానీ, చంద్ర సాయి, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా 'వేల్పుల'

సరుబుజ్జిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి గ్రామానికి చెందిన వేల్పుల గోవిందరావును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. గోవిందరావు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంపై కూటమి నేతలు హర్షం వ్యక్తంచేశారు.

రణస్థలం నుంచి కల్పన

రణస్థలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నారాయణశెట్టి కల్పనను నియమించారు. ఈ మేరకు ఆమె సోమవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును మర్యాద పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా రఘురాం

జి.సిగడాం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామానికి చెందిన వజ్జపర్తి రఘురాం బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం జి.సిగడాం రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఈయన నియామకంపై పలువురు నేతలు హర్షం వ్యక్తంచేశారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

సోంపేట రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గొనకపాడు(కొర్లాం) జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొరుకోల గణపతిరావు (45) ఆదివారం రాత్రి స్వగ్రామం టెక్కలి మండలం తొలుసూరిపల్లిలో ఆకస్మికంగా మృతి చెందినట్లు హెచ్ఎం కృష్ణారావు తెలిపారు. ఉపాధ్యాయుడి ఆకస్మిక మృతి పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది, సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు నివాళి అర్పించారు. మృతునికి భార్య, మూడున్నర ఏళ్ల వయసున్న ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు.

టెక్కలిలో మరో ఐఎంఎల్ డిపో ఎందుకు?

అరసవల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో ఉన్న ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు ఎందుకని మంత్రి అచ్చెన్నాయుడును వామపక్ష నాయకులు డి.గోవిందరావు, కొన్న శ్రీనివాసరావు, తాండ్ర ప్రకాష్ ప్రశ్నించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. 24న కలెక్టర్‌కు మహా రాయబారం నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

క్రైం కార్నర్

విశాఖలో గోడ కూలి కుత్తుమ వాసి మృతి


రామారావు (ఫైల్)

కంచిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డాక్‌యార్డ్‌లో కూలి పనులు చేస్తున్న వారిపై గోడకూలిన ఘటనలో కుత్తుమ గ్రామానికి చెందిన సంగారు రామారావు(60)అనే వలస కూలీ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంగారు రామారావుకు భార్య ఊర్వశితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా భార్య ఊర్వశి కుత్తుమలో ఉంటోంది. రామారావు కూలీలతో కలసి బయట ప్రాంతాలకు భవన నిర్మాణ పనులకు వెళుతుంటాడు. విశాఖపట్నం డాక్‌యార్డ్ వద్ద నూతనంగా గోడ నిర్మాణ పనులు చేస్తుండగా... పక్కనే ఉన్న పాత గోడ కూలీలపై కూలింది. ఈ ప్రమాదంలో రామారావుతో పాటు జనతా కాలనీకి చెందిన ధర్మారావు అనే మరోకూలీ మృతి చెందాడు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేయించి, ఇద్దరి ప్రాణాలు పోవడానికి కారణమైన ప్రత్యూష గోడౌన్ యాజమాన్యం బాధ్యత వహించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. రామారావు మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ సనపల విమల, టీడీపీ నాయకులు సనపల కామేష్, గ్రామస్థులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

పోలాకి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బొద్దాం పంచాయతీ వనవిష్ణుపురం గ్రామానికి చెందిన లండ సూర్యనారాయణ అనే వ్యక్తి ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడని తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుని అదుపులోకి తీసుకున్నామని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

గార రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కళింగపట్నం పంచాయతీ శిలగాం కాలనీకి చెందిన దీర్ఘాశి మహేష్(24) అనే యువకుడు సోమవారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం మహేష్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. మద్యం కోసం నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడుతూ విడిగా ఉండేవాడు. ఆదివారం మద్యం తాగి.. తాను ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడి నాన్నమ్మ ఈ దృశ్యాన్ని చూసి కేకలు వేసి అందరికి తెలియజేసింది. మృతుడు తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ రామిరెడ్డి తెలిపారు.

పశువుల వ్యాన్ స్వాధీనం

హరిపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): కుంటికోట రోడ్డు మీదుగా తొమ్మిది పశువులతో అలమండ సంతకు వెళుతున్న మినీ వ్యానును మందస ఎస్ఐ కె కృష్ణప్రసాద్ సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పరిమితికి మించి పశువులను ఎక్కించటంతో పాటు అక్రమ రవాణా కారణంగా వ్యానును మందస పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు ఆదివారం బిన్నల వద్ద స్వాధీనం చేసుకున్న పశుమాంసాన్ని సోంపేట కోర్టు ఆదేశాల మేరకు మందస జగనన్న కాలనీ సమీపంలో గొయ్యితవ్వి పూడ్చిపెట్టినట్లు ఆయన తెలియజేశారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు

పాతపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గంగువాడ గ్రామ చేరువలో సోమవారం ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్సు ఢీకొన్న ఘటనలో మహిళ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పాతపట్నం నుంచి టెక్కలి వైపు వెళుతున్న బస్సు గంగువాడకు చెందిన రావలవలస నందిని అనే మహిళను ఢీకొంది. దీంతో ఆమె పక్కనే ఉన్న గోతిలో పడింది. ఈ ప్రమాదంలో నందిని పక్కటెముకలకు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన మహిళను పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. ఎస్ఐ బి.లావణ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా 'మీకోసం'


గ్రీవెన్స్‌కు నలుగురే హాజరైన దృశ్యం

నరసన్నపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్(మీకోసం)కు వివిధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. దీంతో మొక్కుబడిగా సాగుతోంది. గ్రీవెన్స్‌కు పూర్తి స్థాయిలో అధికారులు హాజరు కావపోవడంతో అర్జీదారులు జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌కు పరుగులు పెడుతున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు తహసీల్దార్ సత్యనారాయణ, ఎమ్పీడీవో వెంకటేష్ ప్రసాద్, ఉద్యానవన సహాయక అధికారి, విద్యాశాఖ తరుపున మాత్రమే పాల్గొన్నారు. మిగతా శాఖల అధికారులు పాల్గొనక పోవడం గమనార్హం.

పూర్వ విద్యార్థి తల్లిదండ్రుల ఔదార్యం


భవనాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రమణమూర్తి

హరిపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): కుంటికోట గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిల్లి అనిల్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఆయన తల్లిదండ్రులు కిల్లి లక్ష్మణరావు, వామాక్షి దంపతులు తమ కుమారుడి జ్ఞాపకార్థం జీఆర్‌పురం హైస్కూల్‌లో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి విద్యార్థులు భోజనాలు చేసేందుకు విశాలమైన భవనాన్ని నిర్మించారు. సోమవారం హెచ్‌ఎం కర్నెన రమణమూర్తి, బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం ఎస్.యర్రంనాయుడులు భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలను పి-4లో చేర్చండి


మాట్లాడుతున్న కరుణాకరరావు

పాతపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిరుపేద కుటుంబాన్నీ పి-4 అప్‌లోడ్ చేయాలని మండల ప్రత్యేకాధికారి డా.ఎం.కరుణాకరవు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సోమవారం పి-4పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 3,418 నిరుపేద కుటుంబాలను గుర్తించామని తెలిపారు.

ఏపీయూఎస్ అధ్యక్షుడిగా రాజు

పోలాకి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) పోలాకి మండల శాఖ అధ్యక్షుడిగా సింగుపురం రాజు, ప్రధాన కార్యదర్శిగా ఊడికల వేణుగోపాలరావు ఎంపికయ్యారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

కార్మికులను క్రమబద్ధీకరించండి

ఆమదాలవలస/ఇచ్ఛాపురం/పలాస, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులందరినీ క్రమ బద్ధీకరించాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు తాడి సంతోష్, రమేష్ పట్నాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురంలో నిరసన చేపట్టారు. జీవో 36 ప్రకారం రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: నిరసన చేపడుతున్న కార్మికులు


ఇచ్ఛాపురం: పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


పలాస:ర్యాలీలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

రోడ్డు పనుల్లో నాణ్యత లోపమని నిరసన

మెళియాపుట్టి, జూలై 21 (ఆంధ్రజ్యోతి):ఆఫ్‌షోర్ నిర్వాసితుల పునరావాస కేంద్రంలో సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని... దీనిపై ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని గిరిజన సంఘ నాయకులు సవర కుమార్ తెలిపారు. కొంత మంది కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేస్తున్నారని ఆరోపించారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా వారధి

నరసన్నపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) తల్లి లేదా తండ్రిలేని నిరుపేద పిల్లలకు ఎస్‌వీసీటీ ట్రస్టు, పడాల చారిటబుల్ ట్రస్ట్ వారధి కారక్రమం ద్వారా విద్య- ఆరోగ్య వికాసానికి అండగా ఉంటుందని ఎస్వీసీటీ ఛైర్మన్‌కె.రవీంద్రనాథ్, పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కాకినాడ రామకృష్ణంరాజులు అన్నారు. సోమవారం ఓ కల్యాణ మండపంలో సింగిల్ పేరెంట్, తల్లిదండ్రులు లేని 53 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు.

విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలి

టెక్కలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కళాశాల వసతిగృహంలో విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలని నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తలసముద్రం సూర్యం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో ఎం. కృష్ణమూర్తికి అందజేశారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకారం అందించండి: ఎమ్మెల్యే శిరీష


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూలై 21(ఆంధ్రజ్యోతి): మందస, వజ్రపుకొత్తూరు మండలాల మధ్యలో ఏర్పాటయ్యే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రైతులు, ప్రజలు సహకారం అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సోమవారం ప్రజాఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మందస మండలానికి చెందిన రైతులు ఎమ్మెల్యేకు తమ భూములకు ఇబ్బందులు లేకుండా ఎయిర్‌పోర్టు నిర్మించాలని కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఇంకా ఎంత మేరకు భూములు కావాలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని, భూసార పరీక్షలు చేసిన తరువాత ఆమోదం తెలిపితేనే తప్ప భూ సేకరణ జరగదని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా భూ సేకరణ జరుగుతుందని, దీనిపై ప్రజలకు ఉన్న అపోహలు తొలగిస్తామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో పలాస నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. పంటలకు నష్టపరిహారంతో పాటు ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

గౌరవ భావంతో మెలగాలి

ప్రతిరోగికితోనూ సిబ్బంది గౌరవభావంతో మెలిగి సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు పలాస ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త కమిటీ సభ్యులుగా ఎంపికైన దడియాల నర్సింహులు, సవర రాంబాబులను వైద్యులు, సిబ్బందికి ఆమె పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్ణీత సమయంలో వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందిస్తే వారు కలకాలం గుర్తించుకుంటారన్నారు. ఫిర్యాదులు లేకుండా సేవలు అందించి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తొందరలోనే తీసుకువస్తామని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.పాపినాయుడు మాట్లాడుతూ కొన్ని వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసుపత్రిలో మౌలిక సదుపాయల కొరత, జనరేటర్ సమస్య ఉందని, బెడ్లు తగిన విధంగా లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రి నిధులతో వీటిని కొనుగోలు చేస్తామని, ఆపరేషన్లకు అవసరమ్యే సామాగ్రి కొనుగోలు చేయడానికి నిధులు సమకూర్చాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తగా ఎంపికైన సభ్యులు దడియాల నర్సింహులు, సవర రాంబాబులను వైద్యాధికారులు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కూన మోహన్‌బాబు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బతికి ఉన్న కుటుంబాన్ని చంపేస్తారా?

సచివాలయ సిబ్బందిపై జేసీ ఆగ్రహం


ఎంపీడీవో, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ

మెళియాపుట్టి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'బతికి ఉన్న కుటుంబాన్ని చంపేసినట్లు చూపించడం క్షమించరాని నేరం. మీరు కార్యాలయంలో కూర్చొని ఏం ఉద్యోగాలు చేస్తున్నారు?' అంటూ మెళియాపుట్టి సచివాలయ ఉద్యోగులపై జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్‌ఖాన్ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మెళియాపుట్టి గ్రామానికి చెందిన మూగ కృష్ణవేణి పిల్లలతో కలిసి తల్లికివందనం డబ్బులు జమ కాలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. సచివాలయ ఉద్యోగుల తప్పిదంతో బతికి ఉన్న కుటుంబాన్ని చంపేసినట్లు చూపించడం దారుణమని అన్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి 'లో వచ్చిన కథనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఎంపీడీవో ప్రసాద్‌పండా, కార్యదర్శి సతీష్‌ను వెంటనే రావలసిందిగా ఆదేశించారు. తప్పిదానికి పాల్పడిన వారిని తన ముందు హాజరుపరిచారని తెలిపారు. బాధ్యులను సస్పెండ్ చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత కుటుంబానికి తల్లికివందనం డబ్బులు వేయనున్నట్లు చెప్పారు.

శ్రీముఖలింగంలో శివస్వాముల సందడి


ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న శివస్వాములు

జలుమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగంలో శివస్వాముల సందడి మొదలైంది. శ్రావణమాసం ప్రారంభానికే ముందే స్వాములు శివదీక్షను చేపట్టి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరునికి పూజలు చేస్తారు. సోమవారం అనేకమంది శివస్వాములు శ్రీముఖలింగంలో గల మధుకేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా గ్రామోత్సవం

సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు ఈ కార్యక్రమంలో ఈవో వాసుదేవరావు, అర్చకులు నారాయణ మూర్తి, వెంకటాచలం, శివ, అచ్యుత, యోగి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

నందిగాం, జూలై 21(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై బ్యాంకు ఖాతాదారులు, మహిళా సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని పెద్దతామరాపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం రథజనబొడ్డపాడులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సైబర్ మోసగాళ్ల నుంచి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి


ఛైర్మన్, సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా త్రిసభ్య కమిటీ పని చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట సొసైటీలో సోమవారం నిర్వహించిన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. సొసైటీ ఛైర్మన్‌గా దుంగ స్వామిబాబు, సభ్యులుగా కూన వీరన్నాయుడు, రెడ్డి జయరాం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి.. రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో సీఎం చంద్రబాబు నాయుడు సహకార సంఘాలను బలోపేతం చేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రైతులకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని... గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతమయ్యేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘ సీఈవో డి.సత్యనారాయణ, డీజీఎం శిమ్మ జగదీష్, డీసీసీబీ మేనేజర్ రమణమూర్తి, సొసైటీ సీఈవో రాజేశ్వరి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, జలుమూరు, సారవకోట మండల పార్టీల అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, నాయకులు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, తర్ర బలరాం, గురుబెల్లి ఝాన్సీ, వెలమల చంద్రభూషణరావు, పంచిరెడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు.

సారవకోటలో...

సారవకోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సారవకోట సొసైటీ ఛైర్మన్‌గా సురవరపు తిరుపతిరావు, సభ్యులు శిమ్మ రామకృష్ణ, సంపతిరావు మురళీధర్ సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు

జలుమూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప డ్రోన్ గ్రూపు సభ్యులకు, జలుమూరు మండలం కూర్మనాథపురం గ్రామంలోని శ్రీరామన్న డ్రోన్ గ్రూపు సభ్యులకు రాయితీపై సోమవారం డ్రోన్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.9.80 లక్షల విలువ గల డ్రోన్‌కు ప్రభుత్వం రూ.7.84 లక్షలు రాయితీ ఇస్తోందని తెలిపారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే శంకర్


ఆడవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

గార రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలు పంచాయతీ పరిధి ఆడవరం, పిలకవానిపేట, ఎస్సీ, బీసీ కాలనీల్లో సోమవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలను వివరించారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని తక్షణం వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

వజ్రపుకొత్తూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గౌతుశిరీష అన్నారు. సోమవారం సాయంత్రం హుకుంపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కణితి సురేష్ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, రామారావు, ఉమామహేశ్వరావు, లండ వాసు, విఠల్ ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాతపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే సుపరిపాలనకు తొలిఅడుగు లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. గంగువాడ పంచాయతీ బి.గోపాలపురంలో సోమవారం సుపరిపానలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల లచ్చుమయ్య, కర్రి అప్పారావు, చిన్నబాబు, ఎన్ని ఇంద్రసేనుడు, రమణ, గజపతి పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే అభివృద్ధి

కోటబొమ్మాళి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని టెక్కలి నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ అన్నారు. ఆమె సోమవారం సాలిపేటలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి వివరించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న దృశ్యం

టెక్కలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిగా కొనుగోలు చేసిన ఆస్తిని వారసత్వ ఆస్తిగా చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సత్తారు ధనలక్ష్మి ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరసన చేపట్టింది. చింతలగార రెవెన్యూ పరిధిలో బాధిత మహిళ సత్తారు ధనలక్ష్మి, గురువెల్లి పురుషోత్తం ఉమ్మడిగా 63 సెంట్ల ఆస్తిని కొనుగోలు చేశారని, రెవెన్యూ రికార్డుల్లో ఉమ్మడి ఆస్తిగా నమోదైందని తెలిపారు. బోకర మోహనరావు రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి వారసత్వంగా సంక్రమించినట్లు అధికారులతో నమోదు చేయించి తనకు ఏడేళ్లగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాని కోరారు. వీరితో పాటు కొల్లి ఎల్లయ్య, లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగంలో ప్రతిభ

టెక్కలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్స్ చదరంగం పోటీల్లో బాలబాలికల విభాగంలో టెక్కలి నుంచి ఐదుగురు క్రీడాకారులు పాల్గొన్నారని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు. అండర్-8 విభాగంలో టెక్కలికి చెందిన సనపల రిత్విక్ సాయి, బొరిగి అద్విక్, అండర్-10 విభాగంలో జిష్ణు, కె.రుత్విక, అండర్-12 విభాగంలో బొరిగి అభిరామ్‌లు రాష్ట్రస్థాయిలో వెయిటేజ్ పాయింట్లు సాధించారని తెలిపారు. వీరికి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

సదుపాయాలు భేష్

కొత్తూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమ పిల్లలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించటం పట్ల ఆశ్రమ నిర్వాహకులకు జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కె.హరిబాబు అభినందనలు తెలిపారు. సోమవారం కొత్తూరు అనాథాశ్రమాన్ని ఆయన పరిశీలించి... చిన్నారులకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కంటి వైద్య పరీక్షలు

సంతబొమ్మాళి, జూలై21(ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఎంఆర్‌కె దాస్ కంటి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాల కోసం సిఫారసు చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు సీహెచ్.మణికుమార్, కె. చంద్రమౌళి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2025-2026వ సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు శ్రీకాకుళం జిల్లా నివాసులై ఉండాలన్నారు.

సర్పాల సయ్యాట



కోటబొమ్మాళి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం ఊడికలపాడు గ్రామంలోని పొలంలో సోమవారం రెండు పాములు సయ్యాటలాడుతూ కనిపించాయి. వ్యవసాయ పనులు నిమిత్తం పోలానికి వచ్చిన సనపల వైకుంఠరావు, నేతింటి చిన్నబాబు అనే రైతులు ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.